సాక్షి కామారెడ్డి

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



పొంగిపొర్లుతున్న వాగులు..

జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం తెల్లవారు జాము నుంచి వర్షం కురవడంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి.

- 8లో ▸



గుంతల రోడ్డుపై వెళ్లేదెలా?

ఎల్లారెడ్డి నుంచి కల్యాణి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. దీంతో ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.7 /20.4

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం వేళ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్



బాన్సువాడ : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. బాన్సువాడలో కాంగ్రెస్ కార్యకలపాలపై మంత్రి ఆరా తీశారు. కాసుల బాల్‌రాజ్ వెంట టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన రెవెన్యూ అధికారి



కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిగా సీహెచ్ మధుమోహన్ నియమితులయ్యారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి




కామారెడ్డి టౌన్: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా కోర్టు న్యాయమూర్తి టి. నాగరాణి సోమవారం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న ఉచిత న్యాయ సహాయ సేవలు, లీగల్ ఎయిడ్ క్లినిక్, పనితీరు, కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. అనంతరం వంటగది, పరిసరాలను, ఫిర్యాదుల బాక్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాయ సురేశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ శ్రీనివాస్, జైలు సూపరింటిండెంట్ సంజీవ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలో 'రూప్‌చంద్' చేపలు..




బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో కొత్త రకం రూప్‌చంద్ చేపలు ఎక్కువగా చిక్కుతున్నాయని మత్స్యకారులు తెలిపారు. ప్రాజెక్ట్ చరిత్రలో ఇంత వరకు రూప్‌చంద్ చేపలు లభ్యం కాలేదన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు రావడం వలన ఈ రకం చేపలు మహారాష్ట్ర ప్రాంతం నుంచి కొట్టుకువచ్చాయన్నారు. ఈ చేపలు కిలో రూ.200 ధర పలుకుతాయని తెలిపారు.

కామారెడ్డి పట్టణానికి చెందిన రమేశ్ తన తల్లికి బీపీ గోలీలు తీసుకొద్దామని బైకు తీసుకుని బయటికి వెళ్లాడు. మందులు కొనుక్కుని ఇంటికి వెళ్తుండగా నిజాంసాగర్ చౌరస్తా వద్ద పోలీసులు ఆపగా, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు మిగతా పత్రాలను చూపాడు. కానీ పోలీసులు ట్యాబ్‌లో చెక్ చేసి బైకు మీద నాలుగు ఫైన్‌లు ఉన్నట్టు చెప్పారు. అర్జంటుగా మెడిసిన్ కోసం వచ్చానని, తన దగ్గర ఇప్పుడు డబ్బులు లేవని బతిమాలితే వదిలేశారు.



నిజామాబాద్‌కు చెందిన సురేశ్ కామారెడ్డి పట్టణంలో ఉన్న తన బంధువులను పరామర్శించి కారులో తిరిగి వెళ్తుండగా తనిఖీల్లో భాగంగా ఎన్‌హెచ్–44పై పోలీసులు ఆపారు. సురేశ్ తన కారుకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వారికి చూయించాడు. ఈ లోగా కానిస్టేబుల్ ట్యాబ్‌లో చెక్ చేసి చలానా పెండింగ్‌లో ఉంది.. కట్టాలన్నాడు. తన కారు మీద చలానా ఉందన్న విషయం ఆయనకు తెలియదు. తరువాత కడతానని చెప్పినా వినిపించుకోలేదు.



చలానాలతో చిక్కులు!

- మెసేజ్‌లు రాక ఇబ్బందులు
- చాలా మందికి తెలియని పరిస్థితి
- నిత్యం తనిఖీలు చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి పోలీసులు వేస్తున్న చలానాల గురించి చాలా మంది వాహనదారులకు తెలియడం లేదు. వాహన యజమాని ఫోన్ నంబర్లు రిజిస్ట్రేషన్ సమయంలో నమోదై ఉన్నవారికే చలానాలకు సంబంధించిన మెసేజ్‌లు వస్తాయి. అయితే మెజారిటీ వాహన యజమానుల ఫోన్ నంబర్లు నమోదు లేకపోవడంతో వారికి మెసేజ్ లు రావడం లేదు. ఇదే సమయంలో ఆయా వాహనాలపై ఉన్న చలానాల విషయం చెక్ చేసుకుంటే గానీ తెలియని పరిస్థితి. లేదంటే పోలీసులు తనిఖీల సమయంలో తమరి వాహనంపై ఇన్ని చలానాలు ఉన్నాయి. ఇంత డబ్బు చెల్లించాలని చెప్పేదాకా తెలియడం లేదు. ఈ చలానాల గురించి అవగాహన ఉన్న వారు మాత్రమే అప్పుడప్పుడు చెక్ చేసుకుంటారు తప్ప, మిగతా వారికి చలానాలు పెండింగులో ఉన్న విషయం తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

వసూళ్లే తప్ప అవగాహన కల్పించరు..

వాహన తనిఖీల సమయంలో పోలీసులు పెండింగ్ చలానాలు చెల్లించమంటూ వాహదారులపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే వాహనానికి గానీ, డ్రైవింగ్ లైసెన్స్‌కు గానీ మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసే విషయాన్ని విస్మరిస్తున్నారు. చాలా మందికి మొబైల్ నంబర్ అప్‌డేట్ చేయడం తెలియదు. చలానాల వసూళ్ల సమయంలో వాహనదారులతో మాట్లాడి వారి ఫోన్ నంబర్ అడిగి ఈ చలాన్ సిస్టంలో క్షణాల్లో అప్‌డేట్ చేయొచ్చు. కానీ ఎక్కడా ప్రయత్నం జరగడం లేదు. చదువుకున్న వారికి కూడా చాలా మందికి ఈ చలాన్ చెక్ చేసుకునే విధానం తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఫోన్‌కు మెసేజ్ వస్తే అలర్ట్ అవుతారు.

ఫోన్ నంబర్ అప్‌డేట్ చేసుకోవచ్చు..

తమ వాహనానికి, డ్రైవింగ్ లైసెన్స్‌కు తాము వాడుతున్న ఫోన్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవడం కూడా సులువు. అదే సైట్‌లో దిగువ భాగాన 'ప్లీజ్ క్లిక్ హియర్..అప్‌డేట్ యువర్ వెహికిల్/డ్రైవింగ్ లైసెన్స్ మొబైల్ నంబర్' అని ఉన్న చోట క్లిక్ చేస్తే వాహన నంబరు/లైసెన్స్ నంబరు అడుగుతుంది. ఆ వివరాలు నమోదు చేసిన తరువాత అడిగిన వివరాలు, మొబైల్ నంబర్ అప్‌లోడ్ చేస్తే చాలు ఓకే అవుతుంది.

వాహనదారులూ... ఇలా తెలుసుకోవచ్చు

వాహనదారులు తమ వాహనంపై చలాన్లు పెండింగ్‌లో ఉన్నదీలేనిది ఆన్‌లైన్‌లో చెక్ చేసుకుని, ఏదైనా జరిమానా ఉంటే ఆన్‌లైన్‌లోనే చెల్లించొచ్చు. 'తెలంగాణ పోలీస్ ఈ చలాన్' ద్వారా ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తే వెహికిల్ నంబర్ అడుగుతుంది. అక్కడ వాహనం నంబర్‌తోపాటు మిగతా వివరాలు నమోదు చేస్తే పూర్తి వివరాలు వస్తాయి. ఏ రోజు, ఏ సమయానికి ఎలాంటి ఉల్లంఘనకు పాల్పడ్డారు ఫొటోతో సహా కనిపిస్తుంది. జరిమానా, యూజర్ చార్జెస్ ఎంత అన్న వివరాలన్నీ ఉంటాయి. పెండింగ్ చలానాలను క్లియర్ చేసుకోవడానికి అదే సైట్‌లో 'చూజ్ యువర్ మోడ్ ఆఫ్ పేమెంట్' ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించొచ్చు.

జనవరి 1 నుంచి సెప్టెంబర్ 21 వరకు జరిమానాలు

హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపినందుకు	2,47,337
డ్రైవింగ్ లైసెన్స్ చూపకపోవడం	1,01,878
ఓవర్ స్పీడ్	59,979
డ్రంక్ అండ్ డ్రైవ్	8,631
నంబర్ ప్లేట్ సరిగా లేకపోవడం	6,517
రాంగ్ పార్కింగ్	4,832
నంబర్ ప్లేట్ లేకపోవడం	3,575
ట్రిపుల్ రైడింగ్	3,543
మైనర్ డ్రైవింగ్	128



బీర్కూర్ క్యాంపులో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు

ధాన్యం దళారుల పాలు

- పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- వర్షం భయంతో తక్కువ ధరకే ధాన్యం విక్రయిస్తున్న రైతులు
- పలు ప్రాంతాల్లో ప్రారంభమైన కోతలు
- బోనస్‌పై నీళ్లొదిలేసిన రైతులు

బాన్సువాడ : ధాన్యం దళారుల పాలవుతోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట తక్కువ ధరకు అమ్మి అన్నదాతలు నష్టాల్లో కురుకుపోతున్నారు. ఒక పక్క వర్షం భయం, మరోపక్క దిగుబడి తక్కువ రావడంతో అన్నదాత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌కు ఆశపడి ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్న రైతన్న ఆశలపై రబీలో పాలకులు నీళ్లు చల్లారు. దీంతో వానాకాలంలో బోనస్‌పై నీళ్లొదిలేసి ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యం విక్రయించేందుకు అన్నదాత సిద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో జిల్లాలో 3.18 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. గత నెల పదిహేను రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాల కారణంగా పంటలను చీడపీడలు, దోమపోటు, ఎండాకు తెగులు, పాముపొడక తెగుళ్లు ఆశించాయి. వీటి కారణంగా చాలా వరకు ధాన్యం దిగుబడి తగ్గింది. నూర్పిళ్లు చేసిన ధాన్యాన్ని ఆరబెట్టలేని స్థితిలో రైతులు పచ్చి ధాన్యాన్ని విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు వచ్చి బాన్సువాడ, బీర్కూర్, వర్ని, కోటగిరి, రుద్రూర్ మండలాల్లో మకాం వేసి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389 ధర ఉంటే, సాధారణ రకానికి రూ.2369గా ఉంది. దీనికి తోడు ప్రభుత్వం మరో రూ.500 బోనస్ ప్రకటించింది. గత ఖరీఫ్‌లో మాత్రమే బోనస్ చెల్లించిన ప్రభుత్వం ఈ ఏడాది రబీలో బోనస్ చెల్లించలేదు. రైతులు మాత్రం ప్రభుత్వం ప్రకటించే బోనస్‌పై నీళ్లొదిలేశారు. ప్రస్తుతం బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ వర్షం కురుస్తూనే ఉంది. వరి కోతలు కోసే రైతులు ఆరబెట్టేందుకు ఎండ రాకపోవడంతో పచ్చి ధాన్యానికి ఎంతో కొంత ధర వస్తే చాలు అనేలా వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న వ్యాపారులు తక్కువ ధరకు పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ అన్నదాతకు నష్టం కలిగిస్తున్నారు. అసలే దిగుబడి రాక ఆందోళన చెందుతున్న రైతులు వ్యాపారుల చేతుల్లో నిలువునా మోసపోతున్నారు. సన్నరకం ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2100 నుంచి రూ.2200కు, దొడ్డు రకం ధాన్యాన్ని రూ.1800 నుంచి రూ.2000ల వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం బీర్కూర్ ప్రాంతం నుంచి ప్రతి రోజూ పదుల సంఖ్యలో లారీల్లో పచ్చి ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వర్షాల కారణంగా దిగుబడి తగ్గి అప్పుల్లో కూరుకుపోయిన అన్నదాతను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు స్పందించి ఖరీఫ్‌లో పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

జిల్లాలో వరి సాగు	3.11 లక్షల ఎకరాలు
దిగుబడి	5.99 లక్షల మెట్రిక్ టన్నులు (అంచనా)
ధాన్యం కొనుగోలు కేంద్రాలు	421
సహకార సంఘాల పరిధిలో..	233
ఐకేపీ సంఘాల ఆధ్వర్యంలో..	188
ఏ గ్రేడ్ మద్దతు ధర	రూ.2389
సాధారణ రకాల మద్దతు ధర	రూ.2369

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. జిల్లాలో రెండు దశల్లో జరిగే ఎన్నికల కోసం కొత్తగా నియమించిన, గతంలో శిక్షణ తరగతులకు గైర్హాజరైన రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సోమవారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్.. ఎన్నికల విధులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. నామినేషన్ ప్రక్రియ మొదలుకొని ఫలితాల విడుదల వరకు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలింగ్ విధుల్లో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో డీపీవో మురళి, డీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

కామారెడ్డి క్రైం: నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైస్ మిల్లర్లకు సూచించారు. కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)పై కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 సీజన్‌కు సంబంధించి కేటాయించిన సీఎంఆర్ పూర్తి చేసి తిరిగి ఇవ్వడంలో ఇంకా బకాయి ఉన్న మిల్లర్లకు ప్రభుత్వం నవంబర్ 12 వరకు గడువు ఇచ్చిందని తెలిపారు. గడువు లోగా బియ్యాన్ని గోదాములకు పంపించాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్రమం తప్పకుండా మిల్లులను, సీఎంఆర్ ప్రక్రియను తనిఖీ చేయాలన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన సీజన్‌కుగాను మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని మిల్లర్లకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయీస్, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖల అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై చిత్తశుద్ధి ఏదీ..?

- నిరుపయోగంగా ఉన్న కేంద్రం
- బొప్పాస్‌పల్లిలో రూ.4.85 కోట్లు వెచ్చించి వదిలేసిన వైనం
- ఉపయోగంలోకి తీసుకు వస్తే రైతులకు మేలు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం



బొప్పాస్‌పల్లిలో నిరుపయోగంగా మారిన విత్తనశుద్ధి కర్మాగారం

నస్రుల్లాబాద్ : విత్తనశుద్ధిపై చిత్తశుద్ధి కొరవడింది. మండలంలోని బొప్పాస్‌పల్లిలో ఉన్న విత్తనోత్పత్తి క్షేత్రంలో రూ.4.85 కోట్లతో గత ప్రభుత్వం విత్తన శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వంలోని మంత్రులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని 2022 జూన్‌లో ప్రారంభించారు. మిషనరీలు పెట్టి, సీడ్ ప్రాసెసింగ్ చేసి రైతులకు సర్టిఫైడ్ సీడ్ అందించాలనే ఉద్దేశంతో ఈ కర్మాగారం ఏర్పాటు చేశారు. ప్రారంభించడమే కానీ ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా రైతులకు అందివ్వలేదు. కోట్లు వెచ్చించి కాంట్రాక్టర్లకు పనులు చూపించారే కానీ రైతులకు మాత్రం ఎటువంటి ఉపయోగం లేకుండాపోయింది.

ఉత్తదవుతున్న ఉద్దేశం

రైతులకు నాణ్యమైన వరి వంగడాలను అందించి విత్తనాలను ప్రాసెసింగ్ చేసి వారికే ఇవ్వాలనే ఉద్దేశంతో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. కానీ రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఈ కర్మాగారం మాత్రం నిరుపయోగంగా మారింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని అప్పటి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి ప్రారంభించారు.

ఆ నాటి నుంచి ఇక్కడ ప్రాసెసింగ్ జరగక పోగా పంది కొక్కులకు స్థావరంగా మారింది. ఇందులో ఏర్పాటు చేసిన లక్షలా రూపాయల విలువైన యంత్రాలు సైతం పనికి రాకుండా పోతున్నాయి. సంబంధిత అధికారులు ఈ కర్మాగారం అందుబాటులోకి తీసుకుని వస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి

రూ.కోట్లు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. అయితేనే రైతులు దళారులను నమ్మి మోసపోయే పరిస్థితి ఉండదు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తే పెట్టుబడి తగ్గి పంట దిగుబడి పెరుగుతుంది.

– నున్నం సాయిలు, రైతు, కామిశెట్టిపల్లి

18 ఏళ్లు పని చేసినా.. ఉద్యోగాలు ఫట్

- జీజీహెచ్‌లో 16 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు
- అర్ధంతరంగా తొలగించారని ఉద్యోగుల ఆవేదన
- న్యాయం చేయాలని డిమాండ్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న పలువురు ఉద్యోగులను అర్ధంతరంగా విధుల్లో నుంచి తొలగించారు. నిబంధనల పేరుతో తమను తొలగించడంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమకు న్యాయం చేయాలని వారు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు.

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 2007లో అమర్‌నాథ్, 2009లో కవిత, 2012లో నూర్‌సింగ్ ల్యాబ్ టెక్నీషియన్‌లుగా జాయిన్ అయ్యారు. ప్రస్తుతం ముగ్గురినీ విధుల్లో నుంచి తొలగించారు. వీరితోపాటు మరో ఇద్దరు కూడా విధుల్లో చేరగా వారిని యథావిధిగా ఉంచారు. ఆరోగ్యశ్రీ విభాగంలో 2001 నుంచి 2015, ఆ తర్వాత కూడా 18 మంది వరకు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన చేరారు. వేతనాలు రెగ్యులర్‌గా రాకపోవడంతో నలుగురు వెళ్లిపోగా 14 మంది నెల రోజుల క్రితం వరకు విధులు నిర్వర్తించారు. వీరిలో 13 మందిని నెల రోజుల క్రితమే తొలగిస్తున్నట్లు ఆస్పత్రి అధికారులు వారికి తెలిపారు. దీంతో వారంతా రోడ్డున పడ్డారు. టీవీవీపీ పరిధిలో ఉన్నప్పటి నుంచి అలాగే డీఎంఈ పరిధిలోకి వచ్చిన తరువాత కూడా 18 ఏళ్ల నుంచి విధులు చేపడుతున్నా తమను అర్థాంతరంగా తొలగించడం సరికాదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఉన్నతాధికారుల ఆదేశాలు, ఉత్తర్వుల ప్రకారం ల్యాబ్ టెక్నీషియన్‌లను, ఆరోగ్యశ్రీ నిధుల కొరతతో సిబ్బందిని తొలగించామని అధికారులు చెబుతున్నారు.

16 ఏళ్లకు పైగా పని చేశా..



నేను గత 16 ఏళ్లకు పైగా ఆస్పత్రిలోనే పని చేశా. 15 రోజుల క్రితం మమ్మల్ని అర్థాంతరంగా తొలగిస్తున్నట్లు ఆస్పత్రి అధికారులు ప్రకటించారు. ఎంత మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. మాకు న్యాయం చేయాలి.

– కవిత, ల్యాబ్ టెక్నీషియన్, జీజీహెచ్

విధుల్లోకి తీసుకోవాలి



2015లో ఆరోగ్యశ్రీ విభాగంలో జాయిన్ అయ్యా. టీవీవీపీ పరిధిలో ఉన్నప్పుడు మాకు రెగ్యులర్‌గా వేతనాలు ఇచ్చేవారు. జీజీహెచ్ ఆధీనంలోకి వెళ్లిన తరువాత వేతనాలు ఇవ్వకుండా పొమ్మనలేక పొగ పెట్టారు. మమ్మల్ని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి.

– ఇమ్రాన్, ఆరోగ్యశ్రీ డాటా ఎంట్రీ ఆపరేటర్

కుటుంబం రోడ్డున పడింది



2007లో నేను డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా ల్యాబ్ టెక్నీషియన్‌గా విధుల్లో చేరా. 18 ఏళ్లపాటు నిజాయితీగా పని చేశాను. ఇప్పుడు అర్థాంతరంగా విధుల్లో నుంచి తొలగించారు. మా కుటుంబం రోడ్డున పడింది. ఎందుకు తొలగించారో స్పష్టంగా చెప్పడం లేదు.

– అమర్‌నాథ్, ల్యాబ్ టెక్నీషియన్, జీజీహెచ్

నిబంధనల ప్రకారమే..



ల్యాబ్ టెక్నీషియన్‌లు ముగ్గురిని ప్రభుత్వ నిబంధనలు, ఉత్తర్వులు, ఆదేశాల మేరకు తొలగించాం. ఆరోగ్యశ్రీలో వేతనాలకు సరిపడా నిధులు లేకపోవడంతో వారిని కూడా తొలగించాల్సి వచ్చింది. ఉద్యోగుల ఆవేదనను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.


– పి వెంకటేశ్వర్లు, జీజీహెచ్ సూపరింటిండెంట్

'సాగర్' ఐదు గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 32,820 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు సోమవారం తెలిపారు. ఐదు గేట్లను ఎత్తి 32,820 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.8టీఎంసీల) కాగా, 1405 అడుగుల(17.8 టీఎంసీల) పూర్తిస్థాయి మట్టంతో నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కౌలాస్‌లోకి 7,147 క్యూసెక్కులు..

కౌలాస్ ప్రాజెక్టులోకి 7,147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ఐదు గేట్ల ద్వారా 9,782 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237టీఎంసీల)కు గాను 457.85 మీటర్లు(1.201టీంసీల) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మంజీర పరవళ్లు

సంగారెడ్డి జిల్లాలోని కంగ్టి, కల్హేర్, నారాయణఖేడ్, సిర్గాపూర్ మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో నల్లవాగు మత్తడికి వరద పోటెత్తింది. నల్లవాగు మత్తడి అలుగు పైనుంచి 35 వేల క్యూసెక్కులకు పైగా నీరు పొంగిప్రవహించింది. అలాగే నిజాంసాగర్ ప్రాజెక్టు వరదగేట్ల ద్వారా 32 వేల క్యూసెక్కుల నీరు, కళ్యాణి ద్వారా 15 వేలు, సింగితం వాగు, నర్వపాతచెరువు వాగుల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీరు మంజీరాలోకి ప్రవహించడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. మంజీరాకు ఇరువైపులా ఉన్న పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

కరెంట్ సమస్యను పరిష్కరించండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌లోగల ఇందిరానగర్ కాలనీలో కరెంట్ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు వారు సోమవారం ఎల్లారెడ్డిలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డీఈఈ విజయసారథికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో లో–వోల్టేజీ సమస్యతో తరుచూ కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వెంటనే కాలనీలో సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు బదులు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

బినామీలను అడ్డుకోవాలి



కామారెడ్డి అర్బన్: జిల్లాలో మద్యం దుకాణాల వేలంలో ఎస్సీ బినామీలను తొలగించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు బాల్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిడి స్వామి అన్నారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్ ఇన్‌వార్డు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎస్సీలకు రిజర్వు చేసిన వాటిలో బడా కాంట్రాక్టర్లు బినామీలతో టెండర్లు వేయిస్తున్నారని, గత నాలుగేళ్లుగా ఇదే తంతు కొనసాగుతుందని పేర్కొన్నారు. బినామీల ద్వారా దుకాణాలు పొందిన వారిని గుర్తించి ఈయేడు టెండర్లలో వారి పేర్లు తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించాలని బాల్‌రాజ్, స్వామి డిమాండ్ చేశారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడంతో అన్నదాతలకు నష్ట పరిహారం అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రాన్ని అందజేశారు. వరి ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీససౌకర్యాలను కల్పించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు దేవిరెడ్డి విఠల్ రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు



ఉధృతంగా పొంగిపొర్లుతున్న నల్లవాగు మత్తడి



అలుగు పారుతున్న జప్తిజాన్కంపల్లి ఊరచెరువు

- పలు మండలాల్లో మళ్లీ కురిసిన భారీ వర్షం
- రోడ్లు, వంతెనల పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద
- వివిధ గ్రామాలకు నిలిచిన రాకపోకలు



వంతెన పైనుంచి ప్రవహిస్తున్న కాకి వాగు



తెగిన తిమ్మాపూర్ చెరువు కట్ట

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలో సోమవారం వేకువజాము నుంచి కుండపోత వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఎగువ నుంచి వరద ఉధృతంగా రావడంతో వాగులు వంతెనలు, రోడ్ల పైనుంచి నీరు ప్రవహించాయి. లాడేగావ్ శివారులోని వాగు ప్రవాహం రోడ్డు పైనుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే జుక్కల్ నుంచి దోస్త్‌పల్లి వెళ్లే రోడ్డు మార్గం కోతకు గురవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోతకు గురైన రోడ్డును తహసీల్దార్ మారుతి, గిర్దావర్ రాము పటేల్ పరిశీలించారు.

ఎల్లారెడ్డి మండలంలో..

ఎల్లారెడ్డిరూరల్: భారీ వర్షానికి మండలంలోని తిమ్మాపూర్ ఊరచెరువుకట్ట సోమవారం తెగిపోయింది. నెలరోజుల క్రితం భారీ వర్షాల కారణంగా చెరువు కట్ట తెగి నీరు పూర్తిగా పోవడంతో ఇటీవల తాత్కాలిక నిర్మాణ పనులు చేపట్టారు. ఓవైపు పనులు చేస్తుండగా మరోవైపు చెరువు కట్ట తెగి పూర్తిగా నీరు పోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

పిట్లం మండలంలో..

పిట్లం: మండలంలోని తిమ్మానగర్ గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న కాకి వాగు భారీ వర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో తిమ్మానగర్ రహదారిపై ఉన్న లోలెవల్ వంతెన పైనుంచి, అలాగే పిట్లం–కల్లెర్ రహదారిపై ఉన్న వంతెన పైనుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. నెలన్నర రోజుల వ్యవధిలోనే కాకి వాగుకు వరద రావడం ఇది రెండోసారి. వరద తగ్గే వరకు ఈ మార్గంలో ప్రయాణించవద్దని, ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు ప్రజలకు సూచించారు.

నాగిరెడ్డిపేట మండలంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలో సోమవారం ఉదయం సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. వరద పోటెత్తడంతో మండలంలోని జప్తిజాన్కంపల్లి ఊరచెరువు అలుగు పారింది. కాగా ఆదివారం కురిసిన వర్షానికి నాగిరెడ్డిపేట మండలంలో 5సెం.మీ వర్షపాతం నమోదయిందని అధికారులు తెలిపారు.



లాడేగావ్ రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వాగు



దోస్త్‌పల్లి వెళ్లే దారిలో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



బేగంపూర్ తండాలో రోడ్డుపై పారుతున్న వరద

సోయాకు తీవ్ర నష్టం

మద్నూర్(జుక్కల్): మండలంలోని సోనాల, డోంగ్లీ మండలంలోని మొగా, లింబూర్ గ్రామ శివారులో భారీ వర్షం కురవడంతో రైతులు కోసి కుప్ప పెట్టిన సోయా పంట పూర్తిగా దెబ్బతిందని రైతులు పేర్కొన్నారు. అలాగే కోతలు కాకుండ ఉన్న పంట అడ్డం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే వర్షాలు కురిస్తే వచ్చే నాలుగు గింజలు కూడా రావని అన్నదాతలు బాధపడుతున్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి, పంటను సాగు చేస్తే, పంట నోటికి వచ్చే సరికి వర్షం నష్టపరిచిందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని సోయా రైతులు కోరుతున్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్ తండాలో కురిసిన వర్షానికి రోడ్డుపై వరద ఉధృతంగా ప్రవహించి, సమీప ఇళ్లలోకి చేరింది. 161 జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై వరద నీరు నిలిచిఉండటంతో చెరువును తలపిస్తుంది. పలు గ్రామాల్లో సోయా, పత్తి పంటలు మరోమారు వరద కారణంగా నీట మునిగాయి.



మొగా శివారులో సోయా కుప్ప చుట్టూ నీరు

ప్రజావాణికి 60 వినతులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 60 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్‌లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ట్రెయినీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్ ఫిర్యాదులు స్వీకరించారు.

సర్పంచ్ స్థానాలు మరిన్ని కేటాయించాలి

భిక్కనూర్ మండలంలో గతంలో మాదిరిగా ఎస్సీ సామాజిక వర్గానికి సర్పంచ్ స్థానాలు కేటాయించాలని కోరుతూ భిక్కనూర్ అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సంఘం గ్రామ అధ్యక్షుడు భాను మాట్లాడుతూ.. గత సర్పంచ్ ఎన్నికల్లో భిక్కనూర్ మండలంలోని ఐదు జీపీలకు ఎస్సీ రిజర్వేషన్ వచ్చిందన్నారు. ఈసారి మూడు జీపీలకే ఎస్సీ రిజర్వేషన్‌లు కేటాయించారన్నారు. గతంలో కల్పించిన విధంగానే మండలంలో ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

కౌంటింగ్ ఏజెంట్లుగా వీరు అనర్హులు

మీ కోసం...

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎన్నికల ప్రక్రియలో పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లను అభ్యర్థులు నియమించుకుంటారు. వీరికి రిలీవర్లను సైతం ఏర్పాటు చేసుకోవచ్చు. అందుకోసం ముందుగా దరఖాస్తు చేసుకొని (రిటర్నింగ్ అధికారి) నుంచి అనుమతి తీసుకోవాలి. ఇదే సందర్భంలో కొందరు వ్యక్తులను ఏజెంట్లుగా తీసుకునేందుకు అవకాశం ఉండదు.

- స్థానిక ఎన్నికల్లో పదవిలో ఉన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ చైర్మన్లను పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించడానికి వీల్లేదు.
- పదవిలో ఉన్న జడ్పీ చైర్మన్, మండల పరిషత్ అధ్యక్షుడు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా కో–ఆపరేటివ్ సంఘాల చైర్‌పర్సన్లు, ప్రభుత్వ సంస్థల చైర్‌పర్సన్లు, ప్రభుత్వ ప్లీడర్, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగిని పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్‌గా నియమించటం నిబంధనలకు విరుద్ధం.

జంగంపల్లిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి పూజలు



కావ్యారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

భిక్కనూరు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి సోమవారం మండలంలోని జంగంపల్లి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలోని గ్రామదేవతలకు ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావ్యరెడ్డి స్వగ్రామం జంగంపల్లియే. ఆమె తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు తరలివెళ్లి అక్కడే నివసిస్తున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు జన్మనిచ్చిన జంగంపల్లి గ్రామాన్ని ఎప్పుడు మరిచిపోనని గ్రామాభివృద్ధి కోసం కృషిచేస్తానన్నారు. ఈసందర్భంగా ఆమెను గ్రామ బీజేపీ నేతలు ఘనంగా సత్కరించారు. నాయకులు అత్తెల్లి తిర్మలేష్, కుమ్మరి నరేందర్, ప్రమీల, పావని, బాల్‌రెడ్డి, ప్రవీణ్, బాలాజీ, రాము తదితరులు పాల్గొన్నారు.

జీపీవోల మండల కార్యవర్గం ఏర్పాటు



నాగిరెడ్డిపేట మండల జీపీవో కార్యవర్గం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల రెవెన్యూ గ్రామపాలన అధికారుల(జీపీవో) కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేసుకున్నారు. మండలాధ్యక్షుడిగా పిట్ల శంకర్, ఉపాధ్యక్షుడిగా పత్రి రాజు, కార్యదర్శిగా సీహెచ్ గంగాధర్, కోశాధికారిగా సాయిలు, సలహాదారులుగా రవి, సాయిలు, విజయ్, సభ్యులుగా గోపాల్, పెంటయ్య ఎన్నికయ్యారు. అనంతరం జీపీవోల మండల నూతన కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్వర్, ఆర్ఐ మహ్మద్‌ను కలిశారు.

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి శివారులో ప్రమాదకరంగా వంగిన స్తంభాలను అధికారులు సోమవారం మరమ్మతులు చేసి, సరిచేశారు. వంగిన స్తంభాలపై సోమవారం సాక్షిలో 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించి, స్తంభాలను సరిచేశారు. దీంతో సంబంధిత రైతులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



స్తంభాలను సరిచేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి శాఖ ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షులుగా ఎండీ నయిమొద్దీన్, కార్యదర్శిగా నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా నవితేజ, నర్సింలు, కోశాధికారిగా భరత్, కార్యవర్గసభ్యులుగా సంజయ్‌కుమార్, దామోదర్, రాములు, వెంకటరాజం, విజయ్‌కుమార్, ఆశిష్ కుమార్ ఎన్నికయ్యారు.

కాలువ మరమ్మతుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద, నాగిరెడ్డిపేట గ్రామాల సమీపంలో దెబ్బతిన్న పోచారం ప్రధానకాలువకు చేపట్టిన మరమ్మతులను సోమవారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈసందర్భంగా పనులు చేపట్టిన తీరుపై ఇరిగేషన్ ఏఈ అక్షయ్‌కుమార్‌తో ఆయన చర్చించారు. కాలువకుమరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరితోపాటు ఇతర సిబ్బంది ఉన్నారు.

రైతును కాపాడిన అధికారులు



వాగులో చిక్కుకున్న రైతును కాపాడిన అధికారులు

పిట్లం(జుక్కల్):పిట్లం మండలం తిమ్మానగర్ గ్రా మ శివారులో కాకి వాగు, నల్ల వాగు పొంగి పొర్లుతోంది. ఈ వరద ప్రవాహంలో చిక్కుకున్న ఫక్రియా అనే రైతును అధికారులు కాపాడారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం తండాకు చెందిన ఫక్రియా పిట్లం మండలంలోని తిమ్మానగర్ గ్రామ శివారులో పొలం కౌలుకు తీసుకొని పత్తి, వరి సాగు చేస్తున్నాడు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లా డు. అదే సమయంలో పక్కనే ఉన్న కాకి వాగు, నల్ల వాగులో వరద పొంగి పొర్లడంతో ఫక్రియా చిక్కుకున్నాడు. పొలం దగ్గర ఉన్న చెట్టు ఎక్కి కూర్చున్నడు. గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచా రం అందించారు. స్పందించిన సహాయక బృందం తక్షణమే రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. వరద ఉధృతి నుంచి రైతును సురక్షితంగా ర క్షించి, ఒడ్డుకు చేర్చారు. అయితే, పొలం వద్ద ఉన్న ఆవు, బర్రె వరదలో మృతి చెందాయి. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం రాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బైక్ మెకానిక్ బాలు ఆదివారం ఇంటికి తాళం వేసి బీర్మల్ తండాలో ఉన్న బంధువుల వద్దకు కుటుంబసభ్యులతో వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలో దాచిన తులం బంగారు నగలు, 60 తులాల వెండితోపాటు కొంత నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

కోనాపూర్‌లో ఒకరి ఆత్మహత్య



గోర్కంటి స్వామి (ఫైల్)

భిక్కనూరు: బీబీపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన గోర్కంటి స్వామి (26)కి మల్లుపల్లి గ్రామానికి చెందిన శిరీషతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు జన్మించాడు. ఏడాది క్రితం ఇద్దరి మధ్య తగాదాలు కావడంతో శిరీష తల్లిగారింటి వద్దే ఉంటోంది. అప్పటి నుంచి స్వామి తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. సోమవారం వేకువజామున భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి వచ్చిన స్వామి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

అనారోగ్యంతో..



సాయితేజ మృతదేహం

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన చల్ల సాయితేజ(23) రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. అతను ఫిట్స్ రోగంతో బాధపడేవాడు. సోమవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన ఐదుగురికి కామారెడ్డి కోర్టు ఒక రోజు జైలు శిక్ష, జరిమానా విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. సోమవారం నిందితులను కోర్టులో హాజరు పర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ ఒక రోజు జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

ప్రయివేటు బస్సు బోల్తా

- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



బోల్తా పడిన బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: కోతకు గురైన రోడ్డు కారణంగా ఓ ప్రయివేటు బస్సు బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దాదాపు 30 మంది ప్రయాణికులతో నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ ప్రయివేటు బస్సు సిరిసిల్లా రోడ్ ప్రాంతంలోకి రాగానే జాతీయ రహదారిపై అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పట్టణంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, బస్సు అదుపుతప్పిన ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. మరమ్మతు పనులు పకడ్బందీగా చేపట్టకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సు వేగం తక్కువగా ఉండడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు లైన్ జడ్జిగా వెంకటేశ్



నిజామాబాద్‌నాగారం: ఈ నెల 6 నుంచి 19 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరిగే ప్రపంచ జూనియర్ బ్యా డ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు లైన్ జడ్జిగా కామారెడ్డి జిల్లాకు చెందిన బల్ల వెంకటేశ్ ఎంపికయ్యారు. ఈ మేరకు బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసినట్లు నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కేవీ కిరణ్ కుమార్ తెలిపారు. పోటీల్లో 46 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. న్యాయనిర్ణేతగా ఎంపికైన బల్ల వెంకటేశ్‌ని జిల్లా అధ్యక్షుడు కర్నాటి వాసు అభినందించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుండటంతో ఎస్సారెస్పీ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతోంది.లక్షా 11 వేల 500 క్యూసెక్కు ల ఇన్‌ఫ్లో వస్తుండగా, 26 గేట్ల ద్వారా లక్షా ఒ క్క వేయి 480 క్యూసెక్కుల నీటిని విడుదల చే స్తున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వే ల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు,మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా 1090.90(80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నీరుగారుతున్న స.హ చట్టం

- బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఒకరు రెండేళ్లలో సస్పెండ్ అయిన ఉపాధ్యాయుల వివరాలు కావాలని విద్యాశాఖ అధికారి కార్యాలయానికి దరఖాస్తు చేశారు. దీంతో సెక్షన్(8)జె ప్రకారం వ్యక్తిగత సమాచారం అంటూ దరఖాస్తును తిరస్కరించారు.
- జక్రాన్‌పల్లి మండలానికి చెందిన ఓ దరఖాస్తుదారుడు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ అక్రమాలపై వివరాలు కోరగా అధికారుల నుంచి సహాయ నిరాకరణ ఎదురైంది. మొదటి అప్పీల్‌కు వెళ్లగానే తర్వాత సమాచారం కోసం సొమ్ము కట్టాలని సందేశం అందింది.

- సమాచారం ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం
- పేరుకుపోతున్న దరఖాస్తులు
- నేడు జిల్లా కేంద్రంలో సమాచార కమిషన్ సమీక్ష
- పెండింగ్ అప్పీళ్లు, ఫిర్యాదులపై విచారణ

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వం గుప్పిట్లో ఉన్న సమాచారం, సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే హక్కును సామాన్యుడి చేతికి అందించిన ఆయుధం సమాచార హక్కు (సహ) చట్టం. 20 ఏళ్లుగా పౌరులు ఈ చట్టంతో సమస్యలను పరిష్కరించడమే కాకుండా అవినీతిని ఎండగట్టగలిగారు. అయితే జిల్లాలో ప్రస్తుతం చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో సహ చట్టం అమలు తీరు అధ్వానంగా మారింది. నేడు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు, ఫిర్యాదులపై సమాచార కమిషన్ సమీక్ష చేస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

కప్పదాటు వైఖరి..

సమాచార హక్కు చట్టం సెక్షన్–6 ద్వారా వచ్చిన దరఖాస్తులను సదరు ప్రజా సమాచార అధికారులు పట్టించుకోవడం లేదు. సెక్షన్–7(1) ప్రకారం 30 రోజులలో ఇవ్వాల్సిన సమాచారాన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదు. ప్రతి ఏడాది సహ చట్టంపై శిక్షణ పొందుతున్న అధికారులు నిబంధనలను మాత్రం పాటించడం లేదు.

- జక్రాన్‌పల్లి మండలానికి చెందిన పౌరుడు ఆర్మూర్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో నిజామాబాద్ డివిజన్‌కు చెందిన సమాచారం కోసం దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తును సెక్షన్6(3) ప్రకారం ఐదు రోజుల్లో బదిలీ చేయాలి. కాగా, దరఖాస్తుకు సంబంధించిన వివరాలు తమ దగ్గర లేవని సమాచారం ఇచ్చారు. సహ చట్టం ప్రాథమిక అంశాలు తెలిసినా సదరు పీఐవో తమకేమీ తెలియదనట్టు ప్రవర్తించాడు.
- కామారెడ్డి జిల్లాలో రెవెన్యూ, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ కార్యాలయాలు సమాచారం ఇవ్వడం లేదంటూ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రజాప్రతినిధికే సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగితే సామాన్య పౌరుల పరిస్థితి ఏమిటని సహోద్యమకారులు ప్రశ్నిస్తున్నారు.
- ఉమ్మడి జిల్లాలో చాలా కార్యాలయాలు 4(1)బికి చెందిన 17 అంశాలు స్వచ్ఛందంగా వెల్లడించడం లేదు. జిల్లా విద్యాశాఖ సమాచారం ఇవ్వడంలో అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. సెక్షన్ 8ని సాకుగా చూపి సమాచారం ఇవ్వడంలో సదరు పౌర సమాచార అధికారి సహాయ నిరాకరణ చేస్తున్నారు.

పెరిగిన అప్పీళ్లు, ఫిర్యాదులు

జిల్లా నుంచి సమాచార కమిషన్‌లో 271 అప్పీళ్లు, 189 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, విద్యా శాఖ, వైద్యం, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన సహ దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలలకోసారి సహ చట్టం అమలుపై నిర్వహించాల్సిన సమీక్షలు గత కొన్ని నెలలుగా జరగడం లేదు.

కమిషన్ సమీక్షలు చేయాలి

ఉమ్మడి జిల్లాలో సహ చట్టం అమలుతీరుపై సమాచార కమిషన్ మూడునెలలకోసారి సమీక్షించాలి. జిల్లా శాఖల్లో సహ చట్టం అమలు తీరు బాగుంది. కానీ, మండల స్థాయిలో నామమాత్రంగా తయారైంది. సెక్షన్ 4(1) 17 అంశాల సమాచారం అన్ని శాఖలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. దరఖాస్తుదారుల కూడా సరైన పద్ధతులు పాటిస్తే అధికారులు సమాచారం ఇవ్వడానికి సులువుగా ఉంటుంది. – అంకం నరేశ్, కోకన్వీనర్, యూఎఫ్ఆర్‌టీఐ